క్లుప్తంగా

టి.సిరసపల్లిలో టోకెన్ల జారీ



టి.సిరసపల్లిలో ఆరోగ్య సురక్ష టోకెన్లు అందజేస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి

మునగపాక : ప్రతి ఒక్కరూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని టి.సిరసపల్లి సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి కోరారు. ఈ నెల 25న సిరసపల్లిలో జరగనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వలంటీర్లు ,వైద్య సిబ్బందితో కలిసి ఆమె సోమవారం టోకెన్లు అందజేశారు. టోకెన్లు తీసుకున్న ప్రతి ఒక్కరూ 25న జరిగే శిబిరానికి హాజరై వైద్య చికిత్సలు పొందాలన్నారు.

కె.వి.పురంలో పారిశుద్ధ్య పనులు



కె.వెంకటాపురంలో పొక్లెయిన్‌తో చెత్తను తొలగిస్తున్న దృశ్యం

కోటవురట్ల: కె.వెంకటాపురంలో సోమవారం పారిశుద్ధ్యం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. జెడ్పీ హైస్కూల్, స్మశాన వాటిక పరిసరాల్లో భారీగా చెత్త పేరుకుపోవడంతో సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ చర్యలు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు పైల నాని ఆధ్వర్యంలో పొక్లెయిన్‌తో చెత్తను తొలగింపజేసి, చదును చేశారు. పారిశుద్ధ్యం మెరుగుకు సహకరించి స్వచ్ఛ గ్రామాల నిర్మాణానికి అందరూ సహకరించాలని సర్పంచ్ కోరారు.

మెనూ ప్రకారం ఆహారం అందించాలి

మునగపాక : పిల్లలకు మెనూ ప్రకారం ఆహారం అందించాలని మునగపాక సచివాలయ కన్వీనర్ బొడ్డేడ మహేష్ కోరారు. మునగపాకలోని అంగన్‌వాడీ–5 సెంటర్‌ను ఆయన సోమవారం సందర్శించారు. కేంద్రంలో పిల్లల హాజరు, కేంద్రం ద్వారా అందుతున్న సేవలు అడిగి తెలుసుకున్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అన్నపూర్ణ, అంగన్‌వాడీ టీచర్ శివ గణేషమ్మ, మహిళా పోలీసు సూర్యకళ, వైఎస్సార్‌సీపీ గ్రామ శాఖ ప్రధాన కార్యదర్శి బీలా శివ గణేష్, ప్రచార విభాగం అధ్యక్షుడు మణికంత కార్యక్రమంలో పాల్గొన్నారు.

'కోతుల బెడద నుంచి కాపాడండి'



ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్‌కు వినతిపత్రం అందజేస్తున్న సర్పంచ్ గంగప్పలనాయుడు

మునగపాక : కోతుల బెడద నుంచి కాపాడాలని కోరుతూ మండలంలోని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు సోమవారం ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్‌కుమార్‌కు వినతి అందజేశారు. కొంత కాలంగా గ్రామంలోకి కోతులు వచ్చి రహదారి మీదుగా రాకపోకలు సాగించేవారిని గాయపరుస్తున్నాయి. కోతులు గుంపులుగా తిరగడంతో ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జనం భయపడుతున్నారని, కోతుల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరారు.

విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు మృతి



సలోమి (ఫైల్)

కోటవురట్ల : ఎందరికో విద్యాబుద్ధులు నేర్పి వారి ఉన్నతికి కారణమైన విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు మట్ల సలోమీ (84) సోమవారం మృతి చెందారు. రాట్నాలపాలేనికి చెందిన సలోమీ తన సర్వీసులో అత్యధికంగా కోటవురట్ల మండలంలోనే విద్యా బోధన చేశారు. తంగేడులో సుమారు 40 ఏళ్ల పాటు ఉపాధ్యాయురాలుగా పనిచేశారు. లింగాపురం, రాట్నాలపాలెంలో ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేశారు. వృద్ధాప్యంతో పాటు అనారోగ్య సమస్యల కారణంగా విశాఖలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆమె మృతికి పలువురు సంతాపం తెలిపారు.

ఈ కేవైసీ నమోదుకు నేడే గడువు

- ఈక్రాప్ నమోదు దాదాపు పూర్తి
- చివరి దశకు చేరిన ఈకేవైసీ



రైతుల ఈకేవైసీ ప్రక్రియను నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

రాంబిల్లి: పంటల నమోదు ప్రక్రియ దాదాపు పూర్తయింది. పంటల నమోదు, ఈకేవైసీ నమోదుకు అక్టోబర్ 10తో(మంగళవారం) గడువు ముగియనుంది. ఈక్రాప్ పూర్తయినా కొంత మంది రైతుల ఈకేవైసీ చేయాల్సి ఉంది. ఈ ప్రక్రియను కూడా పూర్తి చేసేందుకు వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది ప్రయత్నం చేస్తున్నారు. ఈ ఏడాది రాంబిల్లి మండలంలో వర్షాభావం కారణంగా వరినాట్లు విస్తీర్ణం తగ్గింది. గత ఏడాది 7వేల ఎకరాల్లో రైతులు వరిపంటను సాగు చేయగా ఈ ఏడాది 3900 ఎకరాల్లో రైతులు వరిపంటను సాగు చేశారు. మరో 2400 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. మొత్తం రైతులు 4555 మంది వుండగా 4వేల మందికి ఈకేవైసీ పూర్తయింది. అయితే మొత్తం సాగు విస్తీర్ణం 6300 ఎకరాలకు సంబంధించి ఈక్రాప్ నమోదు పూర్తయింది. ఈక్రాప్ నమోదు రెండు విధాలుగా చేస్తున్నారు. ఈక్రాప్ నమోదు చేసి ఓటీపీ సంబంధిత రైతుకు పంపినపుడు ఆయా ఓటీపీ నంబరును సంబంధిత వీఏఏ లేదా వీహెచ్ఏ, ఎంపీఈవోలకు ఫోన్ ద్వారా చెబితే ఆయా నంబరును ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. ఇలా చేసిన వారికి ఈకేవైసీ అవసరం లేదు. ఓటీపీ చెప్పలేని రైతులు, ఫోన్ లేని రైతులు తప్పనిసరిగా తమ వేలిముద్ర నమోదు చేసుకోవడం ద్వారా ఈకేవైసీ చేయించుకోవాలి. ఈక్రాప్ నమోదు, ఈకేవైసీ చేయించుకున్న రైతులకు పంటల బీమా, పంటల నష్ట పరిహారం ఇతర ప్రభుత్వ సాయం అందుతుంది. పంటల నమోదు ప్రాధాన్యాన్ని రైతులు గుర్తించి తప్పనిసరిగా ఈక్రాప్, ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు కోరుతున్నారు.

పారదర్శకంగా జాబితా

పంటల నమోదు ప్రక్రియను ప్రభుత్వం పారదర్శకంగా నిర్వహిస్తుంది. పంటల నమోదు ప్రాతిపదికన రైతులకు పథకాలు, ప్రభుత్వ సాయం వర్తిస్తుంది. దీంతో పారదర్శకంగా రైతుల జాబితాలను తయారు చేస్తున్నారు. ఈ జాబితాలను ఆర్‌బీకేల వద్ద ప్రదర్శించడం, ఇంకా జాబితాలో పేర్లు లేకపోతే ఆయా రైతులు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తారు. ఆ తర్వాత తుది జాబితాను రూపొందించి సంబంధిత ఆర్‌బీకేల వద్ద జాబితాలను ఉంచుతారు.



నారాయణపురం సమీపంలో వరి పంట

ఈకేవైసీకి రైతులు సహకరించాలి



ఈ ఏడాది వర్షాభావం కారణంగా సాగు విస్తీర్ణం తగ్గింది. గత ఏడాది 7వేల ఎకరాల వరకు వరి సాగు చేయగా ఈ ఏడాది 3900 ఎకరాల్లో మాత్రమే వరి పంటను సాగు చేసారు. నదీ పరివాహక ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో నాట్లు పడ్డాయి. సాగు చేస్తున్న పంటలకు సంబంధించి నమోదు పూర్తి చేశారు. అయితే ఈకేవైసీ మాత్రం మరో 30 శాతం చేయాల్సి ఉంది. రైతులు సహకరించి ఈకేవైసీ చేసుకోవాలి.

– సి.సుమంత, ఏవో, రాంబిల్లి మండలం

పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు

యలమంచిలి ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



నాగులాపల్లి గ్రామశాఖ అధ్యక్షుడు ప్రకాష్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక: పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు పేర్కొన్నారు. మండలంలోని నాగులాపల్లి వైఎస్సార్‌సీపీ గ్రామశాఖ అధ్యక్షునిగా నియమితులైన కాండ్రేగుల ప్రకాష్‌ను ఆయన సోమవారం అభినందించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం కోసం కృషి చేయాలన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, సర్పంచ్ జామి చినమ్మలు, వైస్ ఎంపీపీ చిందాడ దేవి, సచివాలయ కన్వీనర్లు బొడ్డేడ బుజ్జి, సంతోష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి మళ్ల ఉమామహేశ్వరరావు,ఎంపీటీసీ మళ్ల కాశీ సురేష్,పార్టీ నేత సత్యనారాయణ పాల్గొన్నారు.

వడిసెల కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



చోడపల్లిలోని వడిశెల సత్తిబాబు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని చోడపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వడిసెల సత్తిబాబు ఇటీవల మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్యే రమణమూర్తిరాజు సోమవారం పరామర్శించారు. వడిసెల సత్తిబాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ తదితరులు పాల్గొన్నారు.

నేడు పెట్టుగోళ్లపల్లిలో వైద్య శిబిరం

ఎస్.రాయవరం : పెట్టుగోళ్లపల్లి సచివాలయం పరిధిలో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్టు పంచాయతీ కార్యదర్శి రమేష్ తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నలుగురు వైద్య బృందంతో అన్ని రకాల వైద్యపరీక్షలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దేవీ నవరాత్రులకు ఘనంగా ఏర్పాట్లు



దేవవరంలో రాటోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నక్కపల్లి : మండలంలో దేవీనవరాత్రులు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. దేవవరం ఆటోస్టాండ్ వద్ద ఉన్న ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం రాట ఉత్సవం నిర్వహించారు. సర్పంచ్ రాఘవకుమారి, ఉప సర్పంచ్ వేగేశ్న చంటి, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, ఎంపీటీసీలు దండు బలరామరాజు, గొర్ల నర్సింహమూర్తి, వైఎస్సార్‌సీపీ నాయకులు అంగరాజు, పెదరాము, నూకరాజు, చిట్టిబాబు, అప్పలరాజు పాల్గొన్నారు.

అప్పలనాయుడు మృతి తీరని లోటు



మాజీ సర్పంచ్ అప్పలనాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

మునగపాక : నాగులాపల్లి గ్రామాభివృద్ధికి మాజీ సర్పంచ్ స్వర్గీయ అప్పలనాయుడు ఎంతో కృషి చేశారని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు పేర్కొన్నారు. సోమవారం నాగులాపల్లిలో జరిగిన అప్పలనాయుడు సంతాప సభలో ఆయన మాట్లాడారు. సర్పంచ్‌గా ప్రజా సంక్షేమం కోసం అప్పలనాయుడు అందించిన సేవలను కొనియాడారు. ఆయన వెంట డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ పాల్గొన్నారు.

400 మందికి ఉచిత వైద్య పరీక్షలు



వైద్య పరీక్షల కోసం పేర్లు నమోదు చేయించుకుంటున్న గ్రామస్తులు

పాయకరావుపేట : గుంటపల్లి గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వైద్య సిబ్బంది నిర్వహించారు. సుమారు 400 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఎంపీడీవో ఎ.సాంబశివరావు పర్యవేక్షణలో పాయకరావుపేట పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విద్యాసాగర్, శ్రీరాంపురం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ తులసీ నవీన రోగులకు వైద్య పరీక్షలు చేసి, మందులు అందించారు. గైనకాలజీ వైద్యులు డి.అనిష, కంటి వైద్యులు జి.విజయ రోగులకు పరీక్షలకు చేసి, తగు సూచనలు, సలహాలు అందించి మందులు పంపిణీ చేశారు. సుమారు 400 మంది రోగులకు బీపీ, షుగర్, రక్తపరీక్షలు, గుండె పరీక్షలు నిర్వహించి, తగు సూచనలు, సలహాలు అందించారు.

రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు వేణు ఎంపిక



రాష్ట్రస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైన వేణును అభినందిస్తున్న అధ్యాపకులు

మునగపాక : రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలకు స్థానిక నేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థి జి.వేణు అర్హత సాధించాడు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన అండర్–17 బాలుర విభాగంలో వేణు షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొని జిల్లా స్థాయికి, అక్కడ నుంచి త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ మేరకు సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఎం. ప్రసాద్, అధ్యాపకులు వేణును అభినందించారు.

పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ



ఎస్.రాయవరంలో రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేస్తున్న గోవిందరావు

ఎస్.రాయవరం: ప్రభుత్వం చేపట్టిన భూసర్వేతో సమస్యలు పూర్తిగా పరిష్కారం కానున్నాయని వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ మండల శాఖ అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు అన్నారు. మండల కేంద్రంలో రీసర్వే అనంతరం రైతులకు వచ్చిన 936 పట్టాదారు పాసుపుస్తకాలు సోమవారం రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ రైతులు దశాబ్దాల కాలంగా పడుతున్న ఇబ్బందులు రీసర్వేతో ఎట్టకేలకు పరిష్కారం అవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు , సర్పంచ్ భూపతి అప్పారావు, మాజీ సర్పంచ్ ఆదిమూర్తి, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ నారాయణరావు, వీఆర్వో గోపి పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎంవీఆర్ సంస్థ వితరణ



చెక్ అందిస్తున్న ఎంవీఆర్ సంస్థ ప్రతినిధులు

కోటవురట్ల: తంగేడు గ్రామంలో ఇటీవల మృతి చెందిన లాలం శివ కుటుంబానికి ఎంవీఆర్ సంస్థ ఆర్థిక సహాయాన్ని అందజేసింది. సంస్థ అధినేత ముత్యాల వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు సంస్థ ప్రతినిధులు మృతుని కుటుంబ సభ్యులను సోమవారం కలుసుకుని రూ.50 వేలు చెక్ అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఆర్వో సతీష్, సభ్యులు నానాజీ, చిన్నమనాయుడు, గోపాల్, సూర్య, విఘ్నేష్ పాల్గొన్నారు.

మెయిన్ రోడ్డును పరిశీలించిన అధికారులు

పాయకరావుపేట : పాయకరావుపేట పట్టణంలో నిర్మాణం చేపడుతున్న మెయిన్‌రోడ్డు పనులను సోమవారం వీఎంఆర్‌డీఏ డీఈ రవికుమార్ పరిశీలించారు. 2 కిలోమీటర్ల మేర కోటి 90 లక్షల రూపాయలతో చేపట్టిన రోడ్డును పరిశీలించి, తగు సూచనలు, సలహాలు అందించారు. ప్రమాదాల నివారణకు స్పీడ్‌బ్రేకర్లను ఏర్పాటు చేయాలని సీఐ పి.అప్పలరాజు అధికారులను కోరారు. దీంతో స్పీడ్ బ్రేకర్లకు కూడా చర్యలు తీసుకుంటామన్నారు. డీఈ రవికుమార్‌తో పాటు ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు కేశనకుర్తి సత్తిబాబు, తదితరులు వున్నారు.

ఘనంగా గణేష్ అనుపోత్సవం



ఊరేగింపుగా తరలిన బొజ్జ గణపతి

ఎస్.రాయవరం : అడ్డురోడ్డు రేవుపోలవరంలో నిలిపిన బొజ్జ గణపయ్య అనుపోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. దేవతా మూర్తుల ఆకారాల్లో వేషాలు ధరించి ఊరేగింపులో నృత్య ప్రదర్శన చేశారు. దీంతో అడ్డురోడ్డు కూడలిలో సందడి వాతావరణం నెలకొంది. 22 రోజుల పాటు గణపతికి భారీ పూజా కార్యక్రమాలు నిర్వహించి ఊరేగింపుతో అనుపోత్సవం నిర్వహించారు.

జగనన్న పాలనలో ప్రజారోగ్యానికి భరోసా



బయ్యవరం గ్రామంలో ఆరోగ్య సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



మామిడివాడలో వైద్య శిబిరానికి హాజరైన ప్రజలు



నాగులాపల్లిలో వైద్య సేవలపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



పెదపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



రోగిని ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకుంటున్న జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ప్రత్యూష

యలమంచిలి/రాంబిల్లి/అచ్యుతాపురం(అనకాపల్లి)/మునగపాక: రాష్ట్రంలో ప్రజలందరూ ఆరోగ్యంగా జీవించాలనే ఉద్దేశ్యంతోనే ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టారని ఎమ్మెల్యే యు.వి రమణమూర్తిరాజు అన్నారు. సోమవారం ఆయన డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మతో కలిసి జగనన్న సుక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. అలాగే రాంబిల్లి మండలం మామిడివాడలో, అచ్యుతాపురం మండలం పెదపాడు, మునగపాక మండలం నాగులాపల్లి హైస్కూల్లో జరిగిన జగనన్న ఆరోగ్య సుక్ష శిబిరాలను సందర్శించారు. రోగులకు జగనన్న సురక్ష కిట్లు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో మాట్లాడుతూ గత చంద్రబాబు హయాంలో వైద్య రంగం పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని, జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత వాడవాడలా కొత్త ఆస్పత్రులు నిర్మించి వైద్య సేవలు అందిస్తున్నారని అన్నారు. యలమంచిలి నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో కొత్త పీహెచ్‌సీలు నిర్మించి, 104 రకాల మందులు అందుబాటులో ఉండేలా చూస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వం హయంలో ఆస్పత్రుల్లో ఆపరేషన్లు చేసే పరికరాలు లేక డాక్టర్‌లు ఇబ్బందులు పడేవారని ఇప్పుడు ప్రతి ప్రభుత్వాసుపత్రిలో సర్జరీలు చేసేలా, పరికరాలు అందుబాటులో ఉండేలా చూస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ జగనన్న ఆరోగ్య శిబిరాలు వినియోగించుకోవాలని సూచించారు. చంద్రబాబు పాలనలో పీహెచ్‌సీల్లో కనీసం కుక్కకాటు, పాము కాటులకు సైతం మందులు ఉండేవి కావని, జగనన్న పాలనలో పీహెచ్‌సీల్లో ఇద్దరేసి వైద్యులను నియమించడంతో పాటు పూర్తిస్థాయిలో మందులు అందిస్తున్నారని అన్నారు. ప్రతి ఆస్పత్రిలోనూ 140 రకాల మందులు ఉన్నాయని వివరించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల ఎంపీపీలు, అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పాటిపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష

మునగపాక : పాటిపల్లిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరుగుతుందని ఎంపీడీవో మన్మథరావు ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయ పరిధిలోని పాఠశాల ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మన్మథరావు కోరారు.

చోడపల్లిలో...

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని చోడపల్లి సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఈ నెల 10న నిర్వహించనున్నారు.అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు, తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఉన్న వారిని పై ఆస్పత్రులకు సిఫారసు చేయనున్నారు.

పులపర్తిలో...

యమలంచిలి : మండలంలో పులపర్తి గ్రామంలో మంగళవారం ఉదయం 9 గంటల నుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరుగుతుందని ఎంపీడీవో అప్పలనాయుడు తెలిపారు. ఈ ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య బృందం ఉచిత వైద్య సేవలు అందిస్తారని ప్రతి ఒక్కరు ఆరోగ్య సమస్యలు, వైద్య పరీక్షలు చేయించుకుని ఉచిత మందులు పొందాలని, దీర్ఘకాలిక వ్యాధులున్న వారిని ఉన్నత వైద్యానికి ప్రభుత్వాసుపత్రులకు రిఫర్ చేస్తారని తెలిపారు.

గొర్రెలు, మేకల సంతకు దసరా కళ

- స్వల్పంగా పెరిగిన కూరగాయల ధరలు



వ్యాన్‌లో గొర్రెలు, మేకల తరలింపు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం వారపు సంత సోమవారం కళకళలాడింది. చాలా రోజుల తర్వాత గొర్రెలు, మేకల్ని అధిక సంఖ్యలో విక్రయానికి తీసుకొచ్చారు. విజయ దశమి సమీపిస్తుండటంతో ఉమ్మడి విశాఖ జిల్లాతోపాటు తూర్పు గోదావరి జిల్లా నుంచి పెంపకందారులు, వ్యాపారులు అమ్మకానికి తీసుకు వచ్చారు. ఇప్పటి వరకు 500 వరకు ప్రతి వారం అమ్మకానికి వచ్చేవి. ఈ వారం రెట్టింపు అయ్యాయి. దీంతో సంతలో సందడి నెలకొంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు వీటిని కొనుక్కున్నారు. పరిమాణం ఆధారంగా రూ.5 వేల నుంచి రూ.25 వేలు వరకు ధర పలికింది. విశాఖ, గాజువాక, అనకాపల్లి తదితర ప్రాంతాల నుంచి హోటళ్ల నిర్వాహకులు, కొనుగోలుదారులు, వ్యాపారులు వచ్చి కొనుగోలు చేసి వ్యాన్లలో తరలించుకుపోయారు. అయితే ధర ఆశించినంతగా రాలేదని, దశమి ముందు ఉండటంతో వచ్చే వారం ఎక్కువ ధర లభించగలదని నర్సీపట్నానికి చెందిన గొర్రెల వ్యాపారి ముసిలినాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. కొందరు ఆశించిన ధర రాకపోవడంతో జీవాలను వ్యాన్లలో తిరిగి తమ ప్రాంతాలకు తీసుకుపోయారు. కూరగాయల ధరలు స్వల్పంగా పెరిగాయి.

ఆరోగ్య సమస్యలు దూరం



బోడపాలెంలో వైద్య శిబిరం ప్రారంభోత్సవంలో ఓపీ ఫైళ్లు అందిస్తున్న సర్పంచ్ ఎరుకునాయుడు

కోటవురట్ల: జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఇంట్లో ఆరోగ్య సమస్యలు తొలగిపోతాయని సర్పంచ్ శింగంపల్లి ఎరుకునాయుడు అన్నారు. బోడపాలెంలోని ఎంపీయూపీ స్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం సోమవారం నిర్వహించారు. సర్పంచ్ ఎరుకునాయుడు శిబిరాన్ని ప్రారంభించి రోగులకు ఓపీ ఫైల్స్ అందించారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా ఇంటికే వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ఈ శిబిరాలలో 7 రకాల వైద్య పరీక్షలు, 14 రకాల వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. ప్రత్యేక వైద్య నిపుణులు కూడా వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు ఇస్తున్నారన్నారు. ఈ శిబిరంలో 318 ఓపీ నమోదు కాగా 280 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నట్టు ఏవో చంద్రశేఖర్ తెలిపారు. ప్రత్యేక వైద్య నిపుణులు 112 మందిని పరీక్షించి, ఆరుగురికి కళ్లజోళ్లు అవసరమున్నట్టు గుర్తించామని తెలిపారు.

ఇసుక ట్రాక్టరు స్వాధీనం

కోటవురట్ల : ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. ఎస్ఐ నారాయణరావు వివరాల ప్రకారం పందూరు సమీపంలో వరాహనదిలో నుంచి అక్రమంగా ట్రాక్టరులో ఇసుకను తరలిస్తుండగా పట్టుకున్నారు. ఎటువంటి వే బిల్లులు లేకపోవడంతో ట్రాక్టరును స్వాధీనం చేసుకుని పోలీసుస్టేషన్‌కు తరలించారు.

పల్లెకు వచ్చిన పట్టణ వైద్యులు



జేవీపాలెంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం: మండలంలో పల్లెకు పట్టణ వైద్యులు వచ్చి వైద్య సేవలు అందిస్తున్నారని సర్వసిద్ధి వైద్యాధికారి శక్తిప్రియ అన్నారు. జేవీపాలెం గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 408 మందికి వైద్య పరీక్షలు చేసి, 18 మందిని పట్టణ ఆస్పతులకు తదుపరి వైద్యానికి తరలిస్తున్నట్టు చెప్పారు. రోగులకు వివిధ వైద్యనిపుణులు జయలక్ష్మి, శిరిషా భవానీ, వెంకటరావు వైద్య పరీక్షలు నిర్వహించారు.

బాల కార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ర్యాలీ



అచ్యుతాపురం కూడలిలో మానవహారం నిర్వహిస్తున్న కైట్స్ విద్యార్థులు

అచ్యుతాపురం(అనకాపల్లి): బాల్య వివాహాలు నిరోధించాలని, బాల కార్మిక వ్యవస్థను అరికట్టాలని, చిన్నారులపై లైంగిక వేధింపులు ఆపాలంటూ కైట్స్ కళాశాల విద్యార్థులు సోమవారం అచ్యుతాపురం వీధుల్లో ర్యాలీ నిర్వహించి, అచ్యుతాపురం జంక్షన్‌లో మానవ హారం నిర్వహించారు. విద్యార్థులు పోస్టర్‌ను ప్రదర్శిస్తూ, నినాదాలు చేశారు. సీడ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీడ్ ప్రతినిధి హేమవర్ధిని రెడ్డి, కైట్స్ కళాశాల ప్రతినిధులు రెడ్డి చిరంజీవి, ఎ.అప్పలనాయుడు, శంకర్, సన్యాసిరావు, వి.ప్రసాద్, ఎస్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.